క్లుప్తంగా

పోలీసులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

కడప కార్పొరేషన్ : అన్నమయ్య జిల్లా పుంగనూరు వద్ద పోలీసులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నగర అధ్యక్షుడు పి.ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలకు రక్షణగా ఉండే పోలీసులపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలు సంయమనం కోల్పోయి అల్లర్లకు పాల్పడటం దారుణమన్నారు. దాడులకు పాల్పడిన వారిని, వారిని ప్రోత్సహించిన వారిని అరెస్ట్ చేసి తగిన శిక్ష వేయాలన్నారు. ధ్వంసం చేసిన వాహనాల ఖర్చును వారి నుంచి రికవరీ చేయాలన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ముందస్తు అరెస్టులు



పోలీసులు అదుపులోకి తీసుకున్న విద్యుత్ ఉద్యోగులు

కడప కార్పొరేషన్ : తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 8వ తేదీ ఛలో విజయవాడ కార్యక్రమానికి హాజరు కాకుండా విద్యుత్ ఉద్యోగులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. ఈ నిరసనలకు, ఆందోళనలకు ప్రభుత్వ అనుమతి లేనందున ముందస్తు అరెస్టులు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ జేఏసీ నాయకులు మాట్లాడుతూ ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి



సౌత్ జోన్‌లో నినాదాలు చేస్తున్న కార్మికులు

కడప కార్పొరేషన్ : ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7వ తేదీ నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షుడు ఎస్. రవి, ఇ. ప్రకాష్ పిలుపునిచ్చారు. ఆదివారం సౌత్ జోన్ కార్మికులతో వారు మాట్లాడుతూ మొన్న వచ్చిన సచివాలయం సిబ్బందిని రెగ్యులర్ చేశారని, హోంగార్డులకు స్కూటీలు పంపిణీ చేశారని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారన్నారు. మున్సిపల్ కార్మికులకు మాత్రం మొండిచేయి చూపిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఆప్కాస్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.


ఆహ్లాదంగా.. ఆనందంగా



సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం సందర్శకులు ఆహ్లాదంగా, ఆనందంగా గడిపారు. సాంస్కృతిక వేదికపై స్థానిక కళాకారులు తమ ఆటపాటలతో అందరినీ ఆకట్టుకున్నారు. ముఖ్యంగా ఇటీవల ప్రాచుర్యం పొందిన పాటలకు నర్తించి సందర్శకులకు హుషారు గొలిపారు. బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయ అక్కయ్య ప్రదీపా స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని సందర్శకులకు శుభాకాంక్షలు తెలిపారు. దేవుడే మనకు నిజమైన స్నేహితుడని, కష్టసుఖాలు ఆయనకే తెలుపుకోవాలని, ధ్యానంతో దగ్గర కావచ్చని తెలిపారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



మొదటి మూడుస్థానాల్లో నిలిచిన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరం మస్తాన్‌వలి వీధిలోని చదరంగం హాల్‌లో ఆదివారం నిర్వహించిన అష్రఫ్–ప్రసన్న మంత్లీ రోలింగ్ షీల్డ్ చదరంగం పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో జాఫర్ విజేతగా నిలువగా, రెండో స్థానంలో లిఖిత్, మూడో స్థానంలో గుణవర్ధన్ నిలిచారు. తర్వాత స్థానాల్లో చిన్మయ్, యాఫియా, రెడ్డిపవన్, ఉమాదేవి, ఇనోక్, వంశీకృష్ణ, తేజోమయి నిలిచారు. వీరికి జిల్లా చదరంగం అసోసియేషన్ కార్యదర్శి అనీస్‌దర్బారీ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్ శ్రీకాంత్, తబస్సుమ్ పాల్గొన్నారు.

ఆ కార్యాలయాలు..

పచ్చదనానికి నిలయాలు



డీఈఓ కార్యాలయానికి నూతనంగా ఏర్పాటు చేసిన నేమ్‌బోర్డు



పచ్చదనంతో కళకళలాడుతున్న డీఈఓ కార్యాలయ ఆవరణం

కడప నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం, ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణ కార్యాలయాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఆ రెండు కార్యాలయ ఆవరణంలో చెట్లు బాగా పెరిగి పచ్చదనానికి నిలయాలుగా ఉన్నాయి. వీటితోపాటు కార్యాలయ ఆవరణలో అరుగులను ఏర్పాటు చేశారు. కార్యాలయ పనిమీద వచ్చే ఉపాధ్యాయులు ఆ అరుగులపై కూర్చొని సేద తీరే అవకాశం లభించింది. అలాగే పలువురు నేతల విగ్రహాలతోపాటు కార్యాలయ ప్రారంభంలోనే సరస్వతి ఆలయాన్ని కూడా నిర్మించారు. ఇటీవల డీఈఓ కార్యాలయానికి సంబంధించి నూతన నేమ్ బోర్డును ఏర్పాటు చేయడంతోపాటు ప్రహరీకి కూడా రంగులు వేశారు. అలాగే ఆర్ఐఓ కార్యాలయానికి కూడా మరమ్మతులు చేసి పెయింట్లు వేశారు. దీంతో ఆ కార్యాలయం కూడా కళకళలాడుతోంది.

–కడప ఎడ్యుకేషన్



ఆర్ఐఓ కార్యాలయంలో ఉన్న పచ్చని చెట్లు



స్నేహ బంధం.. సేవా సుగంధం

చాలా మంది మిత్రులు సమయం దొరికితే సినిమాకు వెళ్లడమో.. షికారు కొట్టడమో.. సరదాగా ఆటలు ఆడటమో చేస్తుంటారు. కొందరు కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తుంటారు. చాలా తక్కువ మంది మాత్రమే ఇతరుల గురించి ఆలోచిస్తుంటారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తుంటారు. స్వార్థం చూసుకోకుండా పరోపకారానికి ప్రాధాన్యత ఇస్తుంటారు. ఈ చిత్రంలో కనిపిస్తున్న వారంతా స్నేహితులు. రహమతున్నీసా, సునీతా, పర్వానాజ్, నస్రత్, మహమూదా, జ్యోతి తదితరులు ఉన్నారు. తమ స్నేహితురాలు పద్మావతి క్యాన్సర్‌తో మరణించడంతో ఆమె స్నేహానికి గుర్తుగా కడప నగరంలో సఖి ఫౌండేషన్ స్థాపించి పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.. అనాథ ఆశ్రమాలకు నిత్యావసర సరుకులను అందించడం, అభాగ్యులను ఆదుకోవడం ఇలా పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ సేవా సుగంధాలను విరజిమ్ముతున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఇలా మరికొందరు స్నేహితులతో ఇలా సమావేశమయ్యారు.

– కడప కోటిరెడ్డి సర్కిల్



రహమతున్నీసాతో స్నేహితులు

మోడీ నుంచి దేశాన్ని కాపాడుకుందాం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రధాని మోడీ నుంచి దేశాన్ని కాపాడుకుందామని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని పాతబస్టాండు వద్ద ఉన్న జ్యోతి రావు పూలే సర్కిల్‌లో కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తలపెట్టిన ఛలో విజయవాడను జయప్రదం చేయాలని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈ నెల 9న విజయవాడ నగరంలో నిర్వహించే నిరసనను కార్మికులు, కర్షకులు జయప్రదం చేయాలని కోరారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై పన్నుల భారాలను మోపుతూ కార్మికులను బానిసలుగా మార్చేందుకు 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తెచ్చిందన్నారు. మూడు వ్యవసాయ కారిక చట్టాలను తీసుకువచ్చి రైతాంగ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ, ఎల్ఐసీ, ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేట్ దోపిడీదారులకు ఇచ్చేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. మోడీ ఎనిమిది సంవత్సరాల కాలంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూత పడ్డాయని వీటిలో పని చేసే లక్షలాది మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు మద్దిలేటి, సుబ్బరాయుడు, లక్ష్మీదేవి, చంద్రారెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



పాతబస్టాండులోని జ్యోతిరావు పూలేసర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మిక నాయకులు

9న నిరసనను జయప్రదం చేయాలి

ఈ నెల 9న క్విట్ కార్పొరేట్, దేశ్ బచావో పేరుతో కడప నగరంలోని బీఎస్ఎన్ఎల్, తపాలాశాఖ ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎంవి సుబ్బారెడ్డి కోరారు. ఆదివారం నగరంలోని ఏపీ రైతు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

నేడు నగరానికి 2వ జాన్‌పాల్ అవశేషాలు

కడప కల్చరల్ : ప్రముఖ ఆధ్యాత్మికవేత్త 2వ జాన్‌పాల్ పోప్ స్మారక అవశేష పార్థివదేహాన్ని సోమవారం సాయంత్రం కడప నగరం మరియాపురం చర్చి వద్దకు చేర్చనున్నట్లు ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాదరావు, సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్ తెలిపారు. ఆరోగ్యమాత క్షేత్రంలో వారు ఆదివారం విలేకరులకు ఈ విషయం తెలిపారు. రోమన్ క్యాథలిక్ క్రైస్తవ మతాధిపతి పునీత 2వ జాన్‌పాల్ పోప్ 27 సంవత్సరాల పాటు ప్రపంచమంతటా క్రైస్తవ సంఘాన్ని అభివృద్ధి బాటలో నడిపించి 2005లో తనువు చాలించారన్నారు. 9 సంవత్సరాల తర్వాత 2014 ఏప్రిల్ 27న వాటికన్‌సిటీ ఆయనను పునీతునిగా ప్రకటించిందన్నారు. ఆయన అవశేషాలను జీసెస్ యూత్ ఆధ్వర్యంలో ప్రపంచమంతా సకలజాతిజనులకు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా సోమవారం సాయంత్రం 4 గంటలకు మరియాపురం సెయింట్ మేరీస్ కేథిడ్రల్ చర్చికి చేరుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక దివ్యబలిపూజ నిర్వహిస్తామన్నారు. ఆయన స్మారక పార్థివ దేహాన్ని చూసే అవకాశం విశ్వాసులకు అరుదైనదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న చర్చి ఫాదర్లు

వైవీయూ ఉర్దూ విభాగానికి ప్రొఫెసర్ పోస్టులను మంజూరు చేయండి

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ ఉర్దూ విభాగానికి ప్రొఫెసర్ల పోస్టులను మంజూరు చేయాలని రూటా లెక్చరర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్‌వసి ఉల్లా సాహెబ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సత్తార్‌ఫైజీలు కోరారు. ఈ విషయమై ఆదివారం డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు తమ క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 2017 సంవత్సరం నుంచి కేవలం కాంట్రాక్టు లెక్చరర్లతోనే బోధన సాగిస్తున్నారన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ త్వరలో పోస్టుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూటా సమన్వయకర్త మొహమ్మద్ అయూబ్, డైరీ కమిటీ కో చైర్మన్ సయ్యద్ సిరాజుద్దీన్, అకడమిక్ విభాగం రాష్ట్ర కన్వీనర్ మస్తాన్‌వలి, నాయకులు సర్ధార్ మైనుద్దీన్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న రూటా నాయకులు

బాధ్యతలు స్వీకరించిన 'బ్రౌన్' సంచాలకుడు

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నూతన సంచాలకునిగా యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యుడు తప్పెట రామప్రసాద్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. పూర్వ సంచాలకుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, కేంద్రం సిబ్బంది నూతన సంచాలకుడిని ఘనంగా సత్కరించి, ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆచార్య రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ దేశాల తెలుగు సంఘాలతో ఎంఓయూ చేసుకుని బ్రౌన్ కేంద్రం ద్వారా సాహిత్యకృషి చేస్తామన్నారు. ఈ కేంద్రంలో పటిష్టమైన భద్రత, రక్షణ, శుభ్రత, పచ్చదనంతో సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. పాఠకుల కనీస అవసరాలపై శ్రద్ధ చూపుతామని తెలిపారు. అనంతరం పూర్వ సంచాలకుడు మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ బ్రౌన్ కేంద్రం అభివృద్ధికి తమవంతు కృషిచేశామని, నూతన సంచాలకుడు కేంద్రం అభివృద్ధి పట్ల తన ప్రణాళికను స్పష్టంగా తెలిపారని ఆయన ఆధ్వర్యంలో కేంద్రం మరింత ఉన్నతస్థితికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సలహామండలి సభ్యుడు జానమద్ది విజయ భాస్కర్, మొల్ల సాహితీపీఠం అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావులు నూతన సంచాలకుడిని సత్కరించారు. కార్యక్రమంలో బ్రౌన్ పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, లైబ్రరీ అసిస్టెంట్లు ఎన్. రమేష్‌రావు, హరిభూషణ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్. వెంకటరమణ, మౌనిక, సిబ్బంది నీలకంఠేశ్వర్, చంద్రకిశోర్, సుబ్రమణ్యం, రాణి పాల్గొన్నారు.



బ్రౌన్ కేంద్రం నూతన సంచాలకుడిని సన్మానిస్తున్న సిబ్బంది

ఇన్సూరెన్స్ మొత్తం చెల్లించండి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నంద్యాలలోని విజయాడైరీలో ఆపరేటర్‌గా పని చేస్తూ నవంబర్ 2022లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తన భర్త గోనె మాధవరెడ్డికి రావాల్సిన ఇన్సూరెన్స్ మొత్తం తక్షణం చెల్లించాలని బాధితురాలు జి. రాధ విజ్ఞప్తి చేస్తున్నారు. ఇన్సూరెన్స్‌కు సంబంధించిన పత్రాలన్నీ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ ప్రధాన కార్యాలయంలో చాలా కాలం క్రితం సమర్పించామన్నారు. అయినా తన భర్తకు రావాల్సిన ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించడంలో బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా బ్యాంకు చైర్మన్ స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

డీఈఓపై విచారణ చేపట్టాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు, అక్రమ డిప్యుటేషన్లు, అక్రమ వర్కు అడ్జస్ట్‌మెంట్లు, అక్రమ పదోన్నతులపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని సర్వేపల్లి రాధాకృష్ణ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్వీ గంగరాజు కోరారు. ఆదివారం వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు భయభ్రాంతులకు గురికాకుండా డీఈఓను పదవి నుంచి తప్పించి విచారణ జరపాలన్నారు.

పేదలకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర

కమలాపురం : పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే జీఓ నెంబర్ 107, 108 లను ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు చిన్ని, వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం వారు కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో వైద్య సీట్లను వర్గీకరణ కింద విభజించడం అన్యాయం అన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా రాష్ట్రానికి మంజూరు చేసిన 750 సీట్లలో జాతీయ మెడికల్ కౌన్సిలింగ్ ద్వారా 112 సీట్లను అన్ని రాష్ట్రాల వారికి ప్రతిభ ఆధారంగా కేటాయిస్తారన్నారు. మిగిలిన 638 సీట్లలో ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ వలన 319 సీట్లు సాధారణ విభాగానికి కేటాయించడం అన్యాయం అన్నారు. రాజ్యాంగంలో 46 అధికరణ ప్రకారం షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు ఇతర బలహీన వర్గాల ప్రయోజనాలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి మైసూరారెడ్డి ప్రత్యేక పూజలు

కమలాపురం: మాజీ మంత్రి మైసూరారెడ్డి సీతారామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. మండలంలోని కొండాయపల్లెలో ఇటీవల నూతనంగా నిర్మించిన సీతారామాలయ ప్రతిష్ఠ మహోత్సవాలకు రాలేని కారణంగా ఆయన ఆదివారం రాత్రి ఆలయానికి విచ్చేశారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఆలయ నిర్వాహకులు మహేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన్ను సత్కరించారు.

అసంబద్ధంగా ముఖ ఆధారిత హాజరు నిబంధనలు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల ముఖ ఆధారిత హాజరు నిబంధనలు చాలా అసంబద్ధంగా, మానసికంగా ఒత్తిడికి గురి చేసే విధంగా ఉన్నాయని ఏపీ ఎస్టీఎఫ్ జిలా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రామచంద్ర పేర్కొన్నారు. ఆదివారం కడపలోని ఏపీ ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఉదయం 8.45 గంటలకు పాఠశాలకు వెళ్లి హాజరు ఆన్‌లైన్ వేసినప్పటికీ కొన్ని సందర్భాల్లో సాంకేతిక లోపంతో 9 గంటల తర్వాత ముఖ ఆధారిత హాజరు నమోదవుతోందన్నారు. 9 గంటలు దాటిన తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా వారిని సెలవులో ఉన్నట్లు ప్రకటిస్తామని అధికారులు పేర్కొనడం శోచనీయమన్నారు. సాంకేతిక లోపం వల్ల జరిగే తప్పిదానికి ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం సరి కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సాగర్, నాయకులు చంద్రశేఖర్, శ్రీరాములు, ప్రసాద్, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామచంద్ర

ప్రజా సంస్కృతికి పట్టం కట్టిన గద్దర్

కడప కల్చరల్ : ప్రజాకవి గద్దర్ ప్రజా సంస్కృతికి పట్టం కట్టారని, ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జిల్లాకమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆదివారం సాయంత్రం సీపీఎం జిల్లా కార్యాలయంలో గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ మాట్లాడారు. గద్దర్ తన కళలతో ప్రజలను చైతన్య పరిచేందుకు ఎనలేని కృషి చేశారన్నారు. అనేక దశాబ్దాల పాటు యువతను ఉర్రూతలూగించారని, జానపద కళారూపాలకు విప్లవ సాహిత్యాన్ని జోడించి ప్రజాసంస్కృతికి పట్టం కట్టారని, సామాజిక మార్పు కోసం దోపిడీ రహిత సమాజం కోసం తపనపడ్డారని తెలిపారు. ఆయన తను నమ్మిన సిద్ధాంతం కోసం నిర్బంధాన్ని అనుభవించారని, ఆయన మృతి అభ్యుదయ సాహిత్యలోకానికి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. మనోహర్, ఎ. రామ్మోహన్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.దస్తగిరిరెడ్డి, కడప నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, ఓబులేసు, యువజన సంఘం నాయకులు ఉదయ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి ప్రజలకు తీరని లోటు

కడప సెవెన్‌రోడ్స్ : దశాబ్దాలుగా పేద ప్రజల కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న ప్రజా గాయకుడు గద్దర్ మృతి ప్రజలకు తీరనిలోటని దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కె. రామాంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన నిరంతరం సామాజిక న్యాయం కోసం పరితపించారన్నారు. తన ఆటపాటలతో జనాన్ని ఉత్తేజపరిచిన గద్దర్ ఆదర్శప్రాయుడని నివాళులు అర్పించారు.



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు

■ విప్లవ భావాలను జీర్ణించుకొని బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పాటుపడిన గద్దర్ మృతి రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీరనిలోటని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి మగ్బుల్‌బాషా అన్నారు. జన నాట్యమండలి కార్యక్రమాల ద్వారా ఆయన ప్రజల్లో నింపిన స్ఫూర్తి మరువలేనిదన్నారు.

గద్దర్ మృతిపట్ల సంతాపం

కడప కల్చరల్ : గద్దర్ మరణం తెలుగు రాష్ట్రాల ప్రజానీకానికి తీరనిలోటని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి మగ్బుల్‌బాషా అన్నారు. బలహీన వర్గాల విప్లవ స్ఫూర్తి గద్దర్ అని అభివర్ణించారు. గద్దర్ తెలంగాణ పోరాట యోధుడని తెలంగాణ సాధన కోసం తన ఆటపాటలతో ప్రజలను ఉత్తేజ పరిచారని కొనియాడారు.

అందరికీ విద్య, ఉపాధి కోసం పోరాటం

కడప ఎడ్యుకేషన్ : యువత అందరికీ విద్య, ఉపాధి కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో పీడీఎస్‌యూ నగర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువకులు డిగ్రీలు పూర్తి చేసి తగిన ఉద్యోగాలు లేక ఉపాధి కోసం వలసలు వెళుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో పోరాటాలే శరణ్యమన్నారు. అనంతరం పీడీఎస్‌యూ నగర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గణేష్, కార్యదర్శిగా అయూబ్, ఉపాధ్యక్షుడిగా హేమంత్, సహాయ కార్యదర్శిగా శ్రీనాథ్, కోశాధికారిగా రఘురాంసింగ్ నాయక్, కార్యవర్గసభ్యులుగా బాబు, అశోక్, ప్రతాప్, బాలు స్వామి, నాయక్, నాగన్న, శ్రీనివాసులరెడ్డి, గౌస్‌లను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న అంకన్న

• క్రీడా'స్ఫూర్తి' నింపేలా.!


కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానానికి వెళ్లే దారిలో ఉన్న మున్సిపల్ హైస్కూల్ (మెయిన్) క్రీడామైదానానికి సరికొత్త కళ వచ్చింది. కడప నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో మైదానం ప్రహరీలకు క్రీడాకారుల చిత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. నిత్యం వేలసంఖ్యలో క్రీడామైదానానికి వెళ్లే క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేలా ఒలంపిక్ పతక విజేతలు, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారుల చిత్రాలను గీస్తున్నారు. దీంతో అటుగా వెళ్తున్న క్రీడాకారులు నగరపాలక అధికారులు మంచిపని చేస్తోందంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– కడప స్పోర్ట్స్









క్రీడాకారుల చిత్రాలు గీస్తున్న కళాకారులు, దేశఖ్యాతిని చాటి చెప్పిన క్రీడాకారులు